కొడంగల్‌లో కుటుంబసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్‌లో కుటుంబసమేతంగా ఓటు హక్కు వినియోగించుకున్న సీఈవో వికాస్‌రాజ్

ఖమ్మం జిల్లా సత్తుపల్లిలో ఆక్సిజన్ సిలిండర్‌తో ఓటు వేసేందుకు వచ్చిన మాజీ జడ్పీటీసీ గాదె సత్యనారాయణ

లోకం పోకడ



నిజమే సార్.. మన పార్టీకి ఇంకో ఓటన్నా పడేది!

పోలింగ్ రోజు రేవంత్‌రెడ్డి ప్రెస్‌మీట్

ఎన్నికల సంఘానికి బీజేపీ ఫిర్యాదు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : పోలింగ్ రోజు ప్రెస్‌మీట్ పెట్టి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల నియమావళిలోని సెక్షన్ 126ను ఉల్లఘించారని పేర్కొంటూ బీజేపీ సోమవారం ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది. ఉదయం 11.40 నుంచి మధ్యాహ్నం 12:30గంటల మధ్య ప్రెస్‌మీట్ నిర్వహించారని, ఈ సందర్భంగా ప్రజలు బీజేపీకి ఓటేయొద్దని నిర్ణయం తీసుకున్నారని, మహబూబ్‌నగర్ జిల్లా ప్రజలు కాంగ్రెస్‌కే ఓటేయాలని, లోక్‌సభ ఎన్నికల్లో మ్యాజిక్ ఫిగర్ దాటడం బీజేపీకి కలగానే మిగిలిపోనున్నదని రేవంత్ అబద్ధపు ప్రచారం చేశారని పేర్కొన్నది. మోదీ-ఈడీ తెలంగాణలో పనిచేయవని, బీజేపీ గ్రాఫ్ పడిపోయిందని.. ఇలా వ్యతిరేకంగా అనేక కామెంట్లు చేసి ఓటర్లను ప్రభావితం చేసేందుకు ప్రయత్నించారని వివరించింది. ఇది పలు చానళ్లలో ప్రత్యక్ష ప్రసారం అయిందని తెలిపింది. ఈ మేరకు వీడియో ఆధారాలను ఈసీకి అందజేసింది.

రాష్ట్రంలో కొత్త శక్తిగా బీజేపీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల ఫలితాల తర్వాత రాష్ట్రంలో బీజేపీ కొత్త శక్తిగా నిలువబోతున్నదని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఓటేశారని అన్నారు. అన్ని నియోజకవర్గాల్లో బీజేపీకి ప్రజల నుంచి సానుకూల స్పందన వచ్చిందని అన్నారు. ఏపీలో ఎన్నికలు, ఇతర కారణాలతో పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ తగ్గిందని అభిప్రాయపడ్డారు. ఎన్నికలకు ఒక్కరోజుముందు వేలాది ఓట్లను తొలగించారని ఆరోపించారు.

ఓటెత్తిన ఆంధ్రప్రదేశ్

మొదటిపేజీ తరువాయి...

పోలీసులు గృహ నిర్బంధం చేశారు. ఓ చోట ఏకంగా రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. ఏ నియోజకవర్గమనే తేడా లేకుండా ఘర్షణలు జరిగాయి. ఘటనలపై టీడీపీ, వైసీపీ పోటీ పడి ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశాయి. ఘర్షణలపై ఆగ్రహం వ్యక్తం చేసిన కేంద్ర ఎన్నికల సంఘం, ఇరు పార్టీలను హెచ్చరించింది.

అంతటా రెండు పార్టీల వీరంగం

నరసరావుపేటలో ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాస్ ఇంటిపై ప్రత్యర్థి పార్టీ కార్యకర్తలు దాడి చేయడంతో అడ్డుకునేందుకు పోలీసులు రబ్బరు బుల్లెట్లు ప్రయోగించారు. గజపతినగరం నియోజకవర్గంలోని కొత్త శ్రీరంగరాజపురంలో పోలింగ్ అధికారిపై వైసీపీ నేతలు దాడి చేశారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం జెట్టిపాలెంలో టీడీపీ నేతలు ఈవీఎంలను ధ్వంసం చేయడంతో కొద్దిసేపు పోలింగ్ నిలిచిపోయింది. తర్వాత కొత్త ఈవీఎంలు ఏర్పాటు చేసి పోలింగ్ కొనసాగించాల్సి వచ్చింది. పాయకరావుపేట నియోజకవర్గం కొత్తరేవు పోలవరం గ్రామంలో టీడీపీ-వైసీపీ శ్రేణులు కుర్చీలు, కర్రలతో కొట్టుకున్నారు. పల్నాడు రాజుపాలెం మండలం గణపవరంలో వైసీపీ నేత మర్రి సుబ్బారెడ్డిపై టీడీపీ కార్యకర్తలు దాడికి దిగారు. దాడిలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కొడుకు గౌతమ్‌రెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. దీంతో మాచర్లలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నియోజకవర్గంలో పరిస్థితి అదుపుతప్పడంతో మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, అతని సోదరుడు వెంకట్రామిరెడ్డిని పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కారంపూడి మండలం ఒప్పిచర్లలో వైసీపీ కార్యకర్తలు ఈవీఎంలను ధ్వంసం చేశారు. తాడిపత్రిలో ఏకంగా ఎస్పీ వాహనంపైనే దాడి జరిగింది. హిందూపురంలో పరస్పర దాడులకు దిగారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాలలో టీడీపీ వాహనాన్ని వైసీపీ కార్యకర్తలు తగులబెట్టారు. నరసరావుపేట టీడీపీ ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలపై వైసీపీ నేతలు దాడికి దిగారు. పల్నాడు జిల్లా నకరికల్లు మండలం చీమలమర్రిలో వైసీపీ కార్యకర్తలు పోలింగ్ కేంద్రంపై దాడి చేశారు. దాడిలో 20మంది టీడీపీ కార్యకర్తలకు గాయాలయ్యాయని, ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలిసింది. ఈ ఘటనతో భయాందోళనకు గురైన ఓటర్లు పోలింగ్ కేంద్రంలో తలదాచుకున్నారు. దాచేపల్లి మండలం ఇరికేపల్లి, నడికుడిలోనూ ఘర్షణలు జరిగాయి.

ఏపీలోని కడపలో ఎన్నికల సందర్భంగా కొట్టుకుంటున్న ఇరువర్గాలు

ఈసీకి ఫిర్యాదుల వెల్లువ

పోలింగ్ సందర్భంగా జరిగిన ఘర్షణలపై టీడీపీ, వైసీపీ పోటాపోటీగా ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు చేశాయి. స్పందించిన ఈసీ పలు అంశాలపై తక్షణ చర్యలు తీసుకున్నది. పుంగనూరు ఘటనలో ఓ నిందితుడిని అరెస్ట్ చేసి ఎలాంటి అనుమతి లేకుండానే వదిలేసిన ఎస్‌ఐని వెంటనే సస్పెండ్ చేయాలని ఆదేశించింది. ముగ్గురు ఏజెంట్లు కిడ్నాప్‌నకు గురయ్యారంటూ టీడీపీ చేసిన ఫిర్యాదుపై స్పందించిన ఈసీ, వెంటనే పోలీసులను ఆదేశించగా వారు ఏజెంట్ల జాడ కనిపెట్టి తీసుకొచ్చారు. కర్నూల్ జిల్లా ఆదోనిలో ఓటరు స్లిప్పులపై వైసీపీ అభ్యర్థి సాయి ప్రసాద్‌రెడ్డి ఫోటో ముద్రించడంపై ఈసీకి టీడీపీ ఫిర్యాదు చేసింది. టీడీపీకి మద్దతివ్వాలంటూ పోలీస్ అధికారులను అడుగుతున్నారంటూ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుపై ఈసీకి వైసీపీ ఫిర్యాదు చేసింది. రెండు రోజుల క్రితం ఏపీ ఎన్నికలపై ప్రముఖ వ్యూహకర్త ఆర్‌టీవీలో ఇంటర్వ్యూ ఇవ్వడంపైనా వైసీపీ ఫిర్యాదు చేసింది. ఏపీ వ్యాప్తంగా 11 చోట్ల ఈవీఎంలను ధ్వంసం చేసినట్లు ఎన్నికల సంఘం పేర్కొంది. వీటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించినట్లు తెలిపింది. పలు చోట్ల దొంగ ఓట్లు వేసేందుకు ప్రయత్నాలు జరిగినట్టు అధికారులు గుర్తించారు.

పోలింగ్ 76.69 శాతం

ఆంధ్రప్రదేశ్ లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల్లో పోలింగ్‌కు ఓటర్లు పోటెత్తారు. ఉదయం 7 గంటల నుంచే కేంద్రాల వద్ద బారులు తీరారు. రాత్రి 6 తర్వాతా ఇదే పరిస్థితి కనిపించింది. ఎండా, వానను లెక్క చేయకుండా గంటల తరబడి క్యూలో నిలబడి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఓటింగ్‌పై ముఖ్యంగా మహిళలు, వృద్ధులు ఎక్కువగా ఆసక్తి చూపారు. 76.69 పోలింగ్ శాతం నమోదైనట్లు ఏపీ ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా తెలిపారు. అత్యధికంగా చిత్తూరు జిల్లాలో 79.35శాతం, అత్యల్పంగా అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లాలో 63.88శాతం పోలింగ్ శాతం నమోదైంది.

ఓటేసిన ప్రముఖులు

విజయవాడ మధ్య నియోజకవర్గంలోని రైల్వే ఫంక్షన్‌హాల్ పోలింగ్ కేంద్రంలో ఏపీ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్, ఉండవల్లిలో టీడీపీ అధినేత నారా చంద్రబాబు, భువనేశ్వరి, లోకేశ్, బ్రాహ్మణి దంపతులు, పులివెందుల నియోజకవర్గ కేంద్రంలోని బాకరాపురంలో సీఎం జగన్, భారతి దంపతులు తమ కుటుంబసభ్యులతో కలిసి ఓటేశారు. రాజమహేంద్రవరంలోని వీఎల్‌పురంలో బీజేపీ ఏపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలం ఇడుపులపాయలో కడప ఎంపీ అభ్యర్థి వైఎస్ షర్మిల, బ్రదర్ అనిల్ కుమార్ తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

రాత్రి 10 దాకా ఓటింగ్

సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న ప్రతి ఒక్కరు ఓటేసేందుకు రాత్రి 10దాకా అవకాశం కల్పించారు. పలు నియోజకవర్గాల్లో జరిగిన ఘర్షణలపై ఎన్నికల సంఘానికి నివేదిస్తామని, ఆ నివేదిక ఆధారంగా ఎక్కడైనా రీ పోలింగ్‌పై నిర్ణయం తీసుకుంటామని ఎన్నికల అధికారి మీనా తెలిపారు. తెనాలి, మాచర్ల, అనంతరపురంలో పెద్ద ఎత్తున ఘర్షణలు జరిగాయని, 11 చోట్ల ఈవీఎంలు ధ్వంసమయ్యాయని తెలిపారు. మంగళవారం ఉదయం వరకు ఈవీఎంలను స్ట్రాంగ్‌రూంలకు తరలిస్తామని తెలిపారు.

ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	42.3°c	23.9°c
మహబూబ్‌నగర్	41.7°c	29.4°c
నల్లగొండ	40.3°c	27.6°c
రంగారెడ్డి	40.8°c	21.6°c
నిజామాబాద్	39.9°c	24.0°c
మెదక్	39.2°c	20.6°c
ఖమ్మం	38.0°c	26.0°c
కరీంనగర్	36.0°c	27.0°c
వరంగల్	36.0°c	27.0°c
హైదరాబాద్	35.9°c	23.5°c

వారంపాటు తేలికపాటి వానలు

రాష్ట్రంలో తగ్గిన ఉష్ణోగ్రతలు

హైదరాబాద్, మే 13 (నమస్తే తెలంగాణ) : వచ్చే వారం రోజుల పాటు (19వ తేదీవరకు) రాష్ట్రంలో తేలికపాటి నుంచి ఒక మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా వచ్చే ఐదు రోజులు వివిధ ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో పాటు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వెల్లడించింది. గత ఆదివారం తూర్పు మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, మరాఠ్వాడ, అంతర్గత కర్ణాటక, తమిళనాడు మీదుగా కోమరిన్ ప్రాంతం వరకు సముద్ర మట్టానికి 0.9కి.మీ.ల ఎత్తులో కొనసాగిన ద్రోణి సోమవారం బలహీనపడిందని, ఫలితంగా తెలంగాణలో దక్షిణ, ఆగ్నేయ దిశల నుంచి గాలులు వీస్తున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. మరోవైపు, వాతావరణంలో మార్పుల కారణంగా ఉష్ణోగ్రతలు కొంత తగ్గుముఖం పట్టాయి. సోమవారం రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రత 37.8 డిగ్రీలు, కనిష్ఠం 23.5 డిగ్రీలుగా నమోదైంది. గాలిలో తేమ 62శాతం, వర్షపాతం 0.3 మిల్లీమీటర్లుగా నమోదైంది. సోమవారం హన్మకొండ జిల్లాలోని కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షం కురవగా, జయశంకర్ భూపాలపల్లి, జనగాం, మహబూబాబాద్, ములుగు, వరంగల్ జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షం పడింది. మెదక్ జిల్లాలో పలు ప్రాంతాల్లో వడగండ్ల వర్షం కురిసింది.

మొరాయించిన ఈవీఎంలు

- పలు చోట్ల ఆలస్యంగా పోలింగ్
- అధికారులు సరిచేయడంతో ప్రక్రియ ప్రారంభం
- క్యూలైన్లలో ఇబ్బంది పడ్డ అభ్యర్థులు

మహబూబ్‌నగర్, మల్కాజిగిరి, బయ్యారంమే 13 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రాష్ట్రవ్యాప్తంగా పలు పోలింగ్ బూత్‌ల వద్ద ఈవీఎంలు మొరాయించాయి. ఫలితంగా ఓటర్లు ఇబ్బందులు పడ్డారు. వివరాల్లోకెళ్తే.. నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండంలోని నాలుగు గ్రామాల్లో ఈవీఎం మిషన్లు పనిచేయలేదు. అధికారులు సరిచేయటంతో ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. మూసాపేట మండలం రాచాలలో 51వ పోలింగ్ కేంద్రంలో ఉదయం, జానంపేటలో 73వ కేంద్రంలో మధ్యాహ్నం, నవాబ్‌పేట పట్టణంలోని ఉన్నత పాఠశాలలో, మహ్మదాబాద్ మండలం గాధిర్యాల్‌లో 110వ కేంద్రంలో 49 నిమిషాల పాటు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో క్యూ లైన్లలో ఉన్న ఓటర్లు ఇబ్బందిపడ్డారు. కొద్దిసేపటికి వాటిని సరిచేయగా.. కొన్ని చోట్ల మరో కొత్త ఈవీఎం ఏర్పాటు చేశారు. వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం మూలమళ్లలో అరగంటసేపు ఈవీఎం, జోగులాంబ గద్వాల జిల్లా అయిజ 69 పోలింగ్ కేంద్రంలో గంటసేపు వీవీ ప్యాట్ మొరాయించింది. అధికారులు వేరే మిషన్లు ఏర్పాటు చేసి పోలింగ్ జరిగేలా చర్యలు చేపట్టారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మచ్చ బొల్లారం డివిజన్ వీబీఆర్ గార్డెన్ పోలింగ్ బూత్‌లో, కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బన మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని 275 పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించింది. దీంతో ఇక్కడ పోలింగ్ కాస్త ఆలస్యంగా సాగింది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట పట్టణంలోని 6 పోలింగ్ కేంద్రాల్లో ఈవీఎంలు పనిచేయలేదు. అధికారులు వాటిని సరిచేయడంతో ఈ కేంద్రాల్లో కాస్త ఆలస్యంగా పోలింగ్ మొదలైంది. భీమారం మండలం కేంద్రంలో బీఎల్‌వోలు సరిగా పోల్ చిట్టీలు పంపిణీ చేయకపోవడంతో చాలా మంది ఓటు హక్కు వినియోగించుకోకుండా తిరిగి వెళ్లిపోవడం కనిపించింది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని 11పోలింగ్ బూత్‌లలో, రాజన్నసిరిసిల్ల జిల్లాలో నాలుగు ఈవీఎంలు మొరాయించాయి. దీంతో కొంతసేపు ఓటింగ్‌కు అంతరాయం కలిగింది. క్యూలైన్లలో ఉన్న ఓటర్లు ఇబ్బంది పడ్డారు. సిబ్బంది వెంటనే సరిచేసి అందుబాటులోకి తేవడంతో సజావుగా ఓటుహక్కు వినియోగించుకొన్నారు. కోరుట్ల పట్టణంలోని అయ్యప్పగుట్ట ప్రైమరీ స్కూల్‌లోని 160వ పోలింగ్ బూత్‌లో ఈవీఎం మిషన్ మొరాయించగా, తర్వాత సరిచేసి 8.30 గంటల వరకు క్యూలో ఉన్నవారికి ఓటేసే అవకాశం కల్పించారు. నల్లగొండ జిల్లా చిట్యాల మండలం ఉరుమడ్ల 92వ నెంబర్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో పోలింగ్ 45 నిమిషాల ఆలస్యంగా మొదలైంది. ఇక్కడే ఓటు వేయాల్సిన నల్లగొండ బీఆర్ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి క్యూలైన్‌లో వేచి ఉండి ఓటు వేశారు. ఇదే మండలం గుండ్రాంపల్లిలోని 62వ బూత్‌లో ఈవీఎంలో సమస్యతో 2 గంటలు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. యాద్రాది భువనగిరి జిల్లా మోత్కూరు మండలం అనాజిపురంలో 45 నిమిషాలు ఆలస్యమైంది. చౌటుప్పల్‌లోని లింగోజిగూడెంలో 26వ బూత్‌లో గంట ఆలస్యంగా మొదలైంది.

జగిత్యాల జిల్లా కోరుట్ల అయ్యప్పగుట్ట పోలింగ్ కేంద్రంలో ఈవీఎం మొరాయించడంతో క్యూలైన్లో వేచిచూస్తున్న ఓటర్లు

కాంగ్రెస్ అభ్యర్థి గుర్తుపై సిరా చుక్క.. నిలిచిన పోలింగ్

మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలోని వెంకట్రాంపురం గ్రామంలోని పోలింగ్ బూత్ నంబర్ 26లో సుమారు గంట సేపు పోలింగ్‌కు అంతరాయం ఏర్పడింది. ఓ వ్యక్తి ఓటు వేసేందుకు వెళ్లి కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్ గుర్తుపై సిరా చుక్క అంటించాడు. సిరా చుక్క అంటించిన వద్ద ఓటు వేయాలని ఓటర్లకు కొందరు సూచించినట్టు ప్రచారం జరిగింది. దీంతో విషయం తెలుసుకున్న కొందరు బీఆర్ఎస్ నాయకులు పోలింగ్ ఏజెంట్ల ద్వారా ఎన్నికల నిర్వాహకుల దృష్టికి తీసుకువెళ్లారు. ఈవీఎం వారు పరిశీలించి సిరా చుక్క ఉండడాన్ని గుర్తించారు. ఈ విషయంపై ఏజెంట్లు అభ్యంతరం తెలియజేయడంతో గంట పాటు పోలింగ్ నిలిచిపోయింది. అనంతరం మరో ఈవీఎం ఏర్పాటు చేసి ఓటింగ్‌ను ప్రారంభించారు. యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం సింగారంలోని 86 పోలింగ్ కేంద్రంలో కాంగ్రెస్ నేతల తీరుపై బీజేపీ అభ్యంతరం తెలపడంతో కొద్దిసేపు ఓటింగ్ నిలిచిపోయింది. ఇక్కడ బ్యాలెట్ యూనిట్‌పై కాంగ్రెస్ హస్తం గుర్తు వద్ద మార్కర్‌తో మార్క్ చేసి బయటకు వచ్చి ఓటర్లకు చెప్పి ప్రచారం చేస్తున్నారని బీజేపీ కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. అధికారులు జోక్యం చేసుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

బీఆర్ఎస్ గుర్తును చెడిపేసిన దుండగుడు

నాగర్‌కర్నూల్ పార్లమెంటు పరిధిలోని అలంపూర్ నియోజకవర్గంలోని వడ్డేపల్లి మండ లం పైపాడులోని పోలింగ్ బూత్‌లో ఓ వ్యక్తి ఈ వీఎంపై ఉన్న కారు గుర్తును స్కెచ్ పెన్‌తో చెరిపేశాడు. తర్వాత ఓటింగ్‌కు వెళ్లిన కొందరు కారు గుర్తు కనిపించకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేశారు. ఉద్దేశపూర్వకంగానే కారు గుర్తును చెరిపేశారని బీఆర్ఎస్ నాయకులు ఆందోళనకు దిగారు. అధికారులు వచ్చి కారు గుర్తు మళ్లీ అతికించడంతో సమస్య సద్దుమణిగింది.

సైలెంట్ ఓటు.. మొగ్గింది ఎటు?

మొదటిపేజీ తరువాయి...

అందుకున్నది. ఆరేడు స్థానాల్లో రాష్ట్ర పోలింగ్ సగటు కన్నా ఎక్కువ పోలింగ్ శాతం నమోదైంది. పట్టణ ఓటరు కన్నా గ్రామీణ ఓటరే ఎక్కువ చైతన్యం ప్రదర్శించాడు. ఫలితంగా పట్టణాలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం ఎక్కువగా నమోదైంది. ఈ ఎన్నికలు ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం అన్నది ఓటింగ్ సరళిని బట్టి అర్థం చేసుకోవడం కష్టంగా మారింది. కాకపోతే, పార్టీలన్నీ తమకే అనుకూలమని చెప్పుకుంటున్నాయి.

కనిపించని జోష్

ఐదు నెలల క్రితం రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద నెలకొన్న పరిస్థితికి, సోమవారం నాటి లోక్‌సభ ఎన్నికలకు ఏమాత్రం పొంతన లేకుండా పోయింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో పోటీపడిన అభ్యర్థులు, వారు ప్రాతినిధ్యం వహిస్తున్న పార్టీ శ్రేణులు పోలింగ్‌బూత్‌ల వద్ద మోహరించాయి. ఆయా పోలింగ్ బూత్‌ల పరిధిలో ఎవరు ఓట్లు వేశారు? ఎవరు వేయలేదో సరిచూసుకొని ఓటు వేయనివారిని పోలింగ్‌బూత్‌లకు రప్పించాయి. సోమవారం మాత్రం అటువంటి దృశ్యాలు కనిపించలేదు. జహీరాబాద్, మెదక్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం వంటి స్థానాల్లో రాష్ట్ర సగటు పోలింగ్‌శాతం కన్నా ఎక్కువగా నమోదైంది. హైదరాబాద్, మల్కాజిగిరి, సికింద్రాబాద్, చేవెళ్ల స్థానాల్లో రాష్ట్ర సగటుకన్నా తక్కువగా రికార్డు అయింది. ఎక్కువగా నమోదైన పోలింగ్ ఎవరికి అనుకూలం, ఎవరికి ప్రతికూలం, పోలింగ్‌శాతం తక్కువగా నమోదైన నియోజకవర్గాల్లో ఎవరు లాభపడతారు? ఎవరు లాస్ అవుతారు? అనేది అంచనాకు అందడం లేదు.

జాతీయ పార్టీల అంచనాలు తలకిందులు

17 లోక్‌సభ నియోజకవర్గాల్లో నమోదైన పోలింగ్ శాతాన్ని బట్టి బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరికి వారు తమదే విజయం అని గంభీర ప్రకటనలు చేస్తున్నా, లోలోపల అంతుచిక్కని ఉక్కపోతను ఎదుర్కొంటున్నారు. జాతీయ పార్టీలు రెండూ తొలి నుంచీ ద్విముఖ పోటీగానే భావించాయి. ఈ భావనను, వాటి ఆశలను బీఆర్ఎస్ తలకిందులు చేసిందని పోలింగ్ సరళిని బట్టి అర్థమవుతున్నది. ఫలితాలు ఇలా ఉండొచ్చంటూ విశ్లేషకులు చెప్తున్న సంఖ్యలు వాస్తవానికి ఎంతవరకు దగ్గరగా ఉంటాయన్నది ఆసక్తిగా మారింది. 15 లక్షల నుంచి 22 లక్షల (మల్కాజిగిరిలో దాదాపు 38 లక్షలు) ఓటర్లు ఉన్న ఒక్కో నియోజకవర్గంలో 5వేల నుంచి 15వేల మంది ఓటర్లను శాంపిల్‌గా (ఎగ్జిట్‌పోల్స్) తీసుకొని అదే ఫలితమని చెప్పడం శాస్త్రీయ, వాస్తవిక అంచనా ఎలా అవుతుందని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు.

పెరిగిన పోలింగ్ ఎవరికి లాభం?

ఉదయం నుంచి మందకొడిగా సాగిన పోలింగ్ సాయంత్రానికి పెరిగింది. ఆరు గంటల సమయానికి రాష్ట్రవ్యాప్తంగా 65 శాతం నమోదైంది. 2019 పార్లమెంట్ ఎన్నికల్లో నమోదైన 62.72 శాతం కన్నా ఈసారి ఎక్కువగా నమోదు కావడం గమనార్హం. ఈ శాతంలో కొంత మార్పు ఉండే అవకాశం ఉన్నది. లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని అన్ని పోలింగ్ స్టేషన్ల నుంచి స్ట్రాంగ్‌రూంలకు ఈవీ ఎం మిషన్లు వెళ్లే సమయంలో రికార్డు అయిన శాతా న్ని తుది పోలింగ్ శాతంగా చెప్తారు. అందుబాటు లో ఉన్న సమాచారం ప్రకారం అది 65శాతంగా ఉంది. జహీరాబాద్, మెదక్, నల్లగొండ, భువనగిరి, ఖమ్మం లోక్‌సభ నియోజకవర్గాల్లో 70 శాతానికి పై గా పోలింగ్ నమోదైంది. రాష్ట్ర సగటు కంటే ఎక్కువ పోలింగ్ నమోదు అయితే అది ప్రభుత్వ వ్యతిరేకతగా మారే అవకాశం ఉందని గత పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. గత పార్లమెంట్ ఎన్నికల్లో 62.72 శాతం పోలింగ్ శాతం నమోదు కాగా ఫలితాలు ఆశ్చర్యపరిచాయి. 2018లో రెండోసారి 88 అసెంబ్లీ స్థానాలతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ 9 ఎంపీ స్థానాలను గెలుచుకున్నది. అ ప్పుడు బీజేపీ (19.7శాతం) కన్నా ఎక్కువ పోలింగ్ శాతాన్ని సొంతం చేసుకున్న కాంగ్రెస్ పార్టీ (29.8 శాతం)కి వచ్చిన ఎంపీ సీట్లలో తేడాలున్నాయి. ఈ లెక్కన పోలింగ్ గడువు ముగిసిన తరువాత వివిధ సామాజిక మాధ్యమాల్లో పొంగిపొర్లుతున్నవి నిజా'ఇజా'లే తప్ప వాస్తవాలుగా పరిగణించాల్సిన అవసరం లేదని రాజకీయ పరిశీలకులు పేర్కొంటున్నారు. మొత్తం మీద ఈ పెరిగిన పోలింగ్ శాతం రాష్ట్రంలోని కాంగ్రెస్‌కు, కేంద్రంలో మూడోసారి అధికారం కో సం పోటీపడుతున్న బీజేపీకి కలిసి వస్తుందా? లే దంటే, తెలంగాణ ఇంటిపార్టీ బీఆర్ఎస్‌కు కలిసివస్తుందా? అన్నది ఉత్కంఠగా మారింది.

2019 ఎన్నికల్లో మొత్తం పోలింగ్ శాతం: 62.72 శాతం

పార్టీ	పోలింగ్ శాతం	గెలిచిన సీట్లు
బీఆర్ఎస్	41.7%	9
కాంగ్రెస్	29.8%	3
బీజేపీ	19.7%	4

నిశ్శబ్ద విప్లవమే

ఎన్నిక ఎన్నికకూ ఓటరు నాడిని అంచనా వేయడం అంత సులువైన పనికాదని పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ మరోసారి నిరూపించింది. గతంలో ఓటు వేసిన తరువాత ఓటరు ఏదో ఒకరకంగా తానెవరివైపు మొగ్గు చూపారో చెప్పకనే చెప్పే పరిస్థితులు ఉండేవి. ఐదు నెలల క్రితం అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కానీ, సోమవారం లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో కానీ పోలింగ్‌బూత్‌కు వచ్చిన ఓటరు తన అభిప్రాయాన్ని వెల్లడించేందుకు సుముఖత చూపలేదు. ఫలితంగా అభ్యర్థులు, ఆయా పార్టీల్లో మరింత ఉత్కంఠ పెరిగింది. ఒక పార్లమెంట్ నియోజకవర్గంలో ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లు ఉన్నాయి. అక్కడి మొత్తం ఓటర్లు, నమోదైన పోలింగ్ శాతం, అందులో పార్టీల వారీగా పోలైన ఓట్లను అంచనా వేయడం, అదీ మౌనముద్రలోకి జారుకున్న ఓటరు స్థితిని పరిగణనలోకి తీసుకొని అంచనా వేయడం దుర్లభమే అవుతుందని రాజకీయ పరిశీలకులకు చెప్తున్నారు.

వంద శాతం పోలింగ్!

- జగిత్యాల జిల్లా చిన్నకొల్వాయి,
- మెదక్ జిల్లా సంగాయిపేట తండాలో ఓటరు చైతన్యం

సారంగాపూర్/చిలిపిచెడ్ (కొల్చారం), మే 13: సెలవు ఇచ్చినా ఓటేయకుండా పట్టణవాసులు ముఖం చాటేస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో పల్లెలు ఓటుతో చైతన్యాన్ని చాటుతున్నాయి. సోమవారం జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం చిన్నకొల్వాయిలో 100 శాతం పోలింగ్ నమోదైంది. గ్రామంలో 110 మంది ఓటర్లు ఉండగా అందరూ ఓటేశారు. వంద శాతం ఓటింగ్‌కు కృషి చేసిన సెక్టోరల్ ఆఫీసర్ చక్రు నాయక్, కార్యదర్శి ముద్దం విజయ, బీఎల్వో యశోద, రూట్ అధికారి రాజ్‌కుమార్‌ను కలెక్టర్ యాస్మిన్ బాషా ఫోన్ చేసి అభినందించారు. కాగా మెదక్ జిల్లా కొల్చారం మండలం సంగాయిపేటతండాలోని అదనపు పోలింగ్ కేంద్రంలోనూ వంద శాతం పోలింగ్ జరిగింది. సంగాయిపేటతండా 62ఏ అదనపు పోలింగ్ కేంద్రం పరిధిలో 210 మంది ఓటర్లు ఉండగా అంతా తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. వీరిలో చాలా మంది నిరక్షరాస్యులైనప్పటికీ చైతన్యంతో తమ ఓటు వేశారు.

వాట్సాప్ గ్రూపులో వీవీప్యాట్ స్లిప్

- ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని
- అధికారితో బీఆర్ఎస్ నాయకుల వాగ్వాదం

సంగెం, మే 13: పోలింగ్ బూత్‌లో ఓటేసి వీవీ ప్యాట్ స్లిప్‌ను సెల్‌ఫోన్‌లో ఫొటోతీసి వాట్సాప్ గ్రూపులో షేర్ చేయడం వరంగల్ జిల్లా సంగెం మండలంలో కలకలం సృష్టించింది. మండలంలోని ఎల్గూర్‌స్టేషన్ గేట్ తండాకు చెందిన ఓ యువకుడు 211 పోలింగ్ స్టేషన్‌లో ఓటేసి వీవీ ప్యాట్ స్లిప్‌ను ఫొటో తీసి బయటకు వచ్చిన తర్వాత కాంగ్రెస్ పార్టీ గ్రూపులో పోస్ట్ చేశాడు. అది సామాజిక మాధ్యమాల్లో వైరలైంది. దీంతో ఎల్గూర్‌స్టేషన్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకులు సెక్టార్ అధికారికి ఫిర్యాదు చేశారు. సదరు అధికారి స్పందించకపోవడంతో వాగ్వాదానికి దిగారు. సదరు ఓటరుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఈస్ట్‌జోన్ డీసీపీ రవీందర్ పోలింగ్ కేంద్రానికి చేరుకుని సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కాంగ్రెస్, బీజేపీ నేతల డబ్బు పంపిణీ

రూ.3 లక్షల నగదు సీజ్, కేసు నమోదు

మియాపూర్/వీణవంక, మే 13: లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీ నాయకులు పలు చోట్ల డబ్బు పంపిణీ చేస్తూ, ఓటర్లను ప్రలోభపెట్టేందుకు యత్నించారు. అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని రూ.3లక్షలు సీజ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. శేరిలింగంపల్లి నియోజకవర్గపరిధిలోని హైదర్‌నగర్ డివిజన్ హెచ్‌ఎంటీ శాతవాహన నగర్‌లో కాంగ్రెస్ నేత, మాజీ కార్పొరేటర్ భాను, ఆ పార్టీకి చెందిన కార్యకర్త ఓటరు జాబితా స్లిప్పులతో పాటు డబ్బులను పంపిణీ చేశారు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు అక్కడికి చేరుకొని రూ. 2.90 లక్షల నగదు, ఓటరు స్లిప్పులను స్వాధీనం చేసుకొని పోలీసులకు అప్పగించారు. కాంగ్రెస్ నీచ రాజకీయాలకు పాల్పడుతున్నదని, డబ్బులిచ్చి ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నదని నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి రవికుమార్‌యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. కరీంనగర్ జిల్లా వీణవంక మండలం చల్లూరులో సోమవారం ఉదయం పోలింగ్ జరుగుతుండగా బీజేపీకి ఓటేయాలని ఆ పార్టీ నాయకుడు రామిడి ఆదిరెడ్డి ఓటర్లకు డబ్బును పంపిణీ చేశారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఇన్‌చార్జి వడ్లకొండ ఐలయ్య ఆదిరెడ్డిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకొని, ఆయన వద్దనుంచి రూ.11 వేలను స్వాధీనం చేసుకొన్నారు. అధికారుల ఫిర్యాదు మేరకు ఆదిరెడ్డిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తిరుపతి తెలిపారు.